# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్యమాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక 1     ఆగష్టు 1987     సంపుటి 8


## ప్రత్యేక సంపాదకీయము

### ప్రేమ

### *(Love)*

—జె.సి. బెయిలీ.

యోహాను 3:16 బంగారు వాక్యమని పిలవడం కద్దు. అది సూక్ష్మీకరించబడిన బైబిలు అని చెప్పబడుట ఈ మధ్య విన్నాను. మానవుడెంత పాపియైనను దేవుడతని ఇంకా ప్రేమించుచున్నాడు. ఎంచుకొనే శక్తిగలవానిగ దేవుడు మానవుని చేసాడు. దేవుని ప్రేమ వలన మానవుడు మేలుపొందాలంటే మానవుడు దేవుని ప్రేమించాలి. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహా 3:16). ప్రేమనుగూర్చి మాట్లాడునప్పుడు లోకములో యున్న అత్యంత గొప్ప శక్తిని గూర్చి మనము మాట్లాడుదుము, ఏలయనగా దేవుడు ప్రేమమైయున్నాడు (1 యోహా 4:8).

దేవుని ప్రేమవలన మనము మేలు పొందాలంటే, దేవుని కుమారునియందు మనము విశ్వాసముంచాలి. మనము దేవుని కుమారునికి లోబడాలి: "ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై - తనకు విధేయులైన వారందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:10). విశ్వాస మూలమున మాత్రమే రక్షింపబడము. ఏలయనగా, "యేసుక్రీస్తు నందుండు వారికి సున్నతి పొందుట యందేమియు లేదు, పొందక పోవుటయందేమియు లేదుగాని ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును" (గల 5:6). దేవుని ప్రేమ మన జ్ఞానాతీతమైనంత గొప్పది. "జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకు తగిన శక్తిగలవారు కావలెనని ప్రార్థించుచున్నాను" (ఎఫెసీ 3:19). దేవుడు ప్రేమయై యున్నాడు. గనుక మానవుడెవడు పూర్తిగా దేవుని గ్రహించుకోలేడు. అయితే దేవుని ప్రేమనుగూర్చి మనం ఎక్కువ తెలిసికోలేమని, ఎక్కువ ప్రేమించలేమని దీని యర్థము కాదు. "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (1 యోహా 5:3). మనము దేవుని ప్రేమించునప్పుడు ఆయన చిత్తాన్నంతటినీ జరిగించుటకు ఆతుర పడుదుము. మనము దేవుని ఎంత ప్రేమించాలి? "అందుకాయన - నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే" (మత్త 22 : 37, 38). మనం ప్రేమించువారి కేమైనా చేయడం కష్టం కాదు. మాకు 27 గురు మనుమలున్నారు. వారిలో ఒక్కొక్కరికి ఒక చలి కంబలి (quilt) కుట్టుటకు నా భార్య నిశ్చయించుకొన్నది. అంత పెద్దపని పెట్టుకోవద్దని మా కుటుంబసభ్యులు ఆమెకు చెప్పజూచారు. ఆమె ఆ పని ఎందుకు చేయుచున్నది? ఆమె తన మనుమలను ప్రేమించుచున్నది. ఆ విధంగా పనిచేయడం ఆమెకు ఆనందం. "క్రీస్తుప్రేమ

మమ్మును బలవంతము చేయుచున్నది; ఏలాగనగా అందరికొరకు ఒకడు మృతి పొందెను గనుక అందరును మృతి పొందిరనియు ... ఆయన అందరికొరకు మృతి పొందెననియు నిశ్చయించుకొని యున్నాము" (2 కొరింథీ 5:14).

ప్రేమతో దేవుని సేవించుట ఎంత గొప్పదంటే, మనకు అన్నీ యున్న ను ప్రేమ లేకపోతే యేమీ లేదని చెప్పబడింది (1 కొరింథీ 13:1-3). దేవుడెల్లప్పుడు నిర్దేశింపబడిన చట్టము చొప్పున పనిచేయును. ప్రకృతిని పఠించుట ద్వారా మానవులు ప్రకృతి చట్టము నెరుగుదురు. దేవుడు చట్టాలను తయారు చేసాడు. మానవుడు వాటినుపయోగించుచున్నాడు. దేవుడు నైతిక ఆత్మీయ సూత్రాలను చేసాడు. యివి బైబిలులో బయలు పర్చబడ్డాయి. ఈనాడు "ఎయిడ్స్" (AIDS) అనే ఘోరవ్యాధి లోకంలోయున్నది. ఎందువలన? మానవుడు దేవుని నైతిక చట్టముల నుల్లంఘించి నందువలన. ఎయిడ్స్ యొక్క విరుగుడు కొరకు మానవులు కోట్లకొలది రూపాయలను ఖర్చుపెట్టుచున్నారు. అయితే సరియైన ఒకే ఒక్క విరుగుడు ఉన్నది. మానవుడు దేవుని చట్టమునకు విధేయుడైతే, ఈ ఘోరవ్యాధి భూమినుండి నాశనమయి పోతాది.

దేవుడొక ఆత్మీయ చట్టాన్ని చేసాడు. క్రీస్తు సంఘమును ప్రేమించి దానికొరకు తన్నుతాను అప్పగించుకొన్నాడని అది చెప్తుంది. ఆయన దానిని పవిత్రపరచాడు. మానవుడు ఒకే ఒక్క భార్యను కలిగియుండాలని దేవుడు కోరాడు. అల్లే క్రీస్తుకు కూడ ఒకే ఒక్క సంఘముండాలని ఆయన కోరాడు. ఒకే ఒక్క శరీరమున్నది (ఎఫెసీ 4 : 4). ఆ ఒకేశరీరం యేమిటి? "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయైయున్నది"

(ఎఫెసీ 1:22, 23). దేవుని చట్టాన్ని ప్రయోజనాన్ని గమనించుము: "మనలో కార్యసాధకమైన తనశక్తి చొప్పున మనము అడుగు వాట న్నిటి కంటెను ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి, క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక, ఆమేన్" (ఎఫెసీ 3 : 20, 21).

వివాహములో దైవిక చట్టమున్నది. "ఈ హేతువుచేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరు ఏక శరీరమవుదురు" (ఎఫెసీ 5 : 31). పురుషునికి ఒకే ఒక్క భార్య యుండాలని క్రైస్తవ లోకమంతా గుర్తించుటలేదా ? అట్లయితే క్రీస్తుకు ఒకే ఒక్క సంఘమున్నదని కూడ మనము గుర్తించాలి. భార్య భర్త లిద్దరు ఏకశరీరమవడం గొప్ప మర్మము; ఇది ఎంత సత్యమో నే నెరుగుదును. ఏలయనగా నాకు నా భార్యకు వివాహమై 63 సంవత్సరములు అయ్యింది. మేము నిజంగా ఏకశరీరమైయున్నాము. "ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తును గూర్చియు సంఘమును గూర్చియు చెప్పుచున్నాను" (ఎఫెసీ 5:32). "పురుషులారా మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి...దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను." పురుషుడు ఒకే భార్యను ఎట్లు ప్రేమిస్తాడో అట్లే క్రీస్తు సంఘమును ప్రేమిస్తాడు. క్రీస్తు శరీరమైయున్న ఒకే సంఘము తప్ప మరేది క్రొత్త నిబంధనలో కనబడదు. క్రీస్తు సంఘమును ప్రేమించుచున్నాడు, దాని కొరకు తన్నుతాను అప్పగించుకొన్నాడు. ప్రేమ పరస్పరమైనది. ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము. భర్తలు భార్యలను భార్యలు భర్తలను ప్రేమించాలి. కొందరు తమ భార్యలను కొట్టేవారున్నారు. ఎందువలన ? తమ భార్యలను ప్రేమించనందువలన. అయితే క్రీస్తు మనలను ప్రేమించాడు, మనకొరకు మరణించాడు, మనము క్రీస్తును ప్రేమించకపోతే

దాని ప్రయోజనం మనకు శూన్యము. మన మాయనను ప్రేమించిన యెడల ఆయన ఆజ్ఞలను గైకొందుము (1 యోహా 2 : 5).

దేవునికి ఒకేఒక్క సంఘమున్నది. క్రీస్తు ఆ సంఘాన్ని ప్రేమించాడు. ఆయన ఆ ఒక్కదానికొరకు మరణించాడు. గనుక క్రొత్త నిబంధన సంఘాన్ని నిర్మించాలంటే మనము దేవుని ప్రేమించాలి, దేవుని చిత్తాన్ని జరిగించాలి. యిది కొద్దిమంది బోధకుల బాధ్యతయే కాదు. యిది ప్రతి సంఘ సభ్యుని బాధ్యత. "ప్రతి మనుష్యుని క్రీస్తు నందు సంపూర్ణునిగా చేసి ఆయన యెదుట నిలువబెట్టవలెనని సమస్త విధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికి బుద్ధి చెప్పుచు ప్రతి మనుష్యునికి బోధించుచు, ఆయనను ప్రకటించుచున్నాము" (కొలస్స 1:28).

---

## పాపములనుండి మారుమనస్సు
## (Repentance of Sins)

సువార్తయొక్క మరియొక ఆజ్ఞ మారుమనస్సు పొందుట. కాని, మారుమనస్సు అనగా నేమి? దానికి క్రీస్తుయొక్క మరణము, సమాధి, పునరుత్థానములతో ఎట్టి సాదృశ్యము కలదు? మొదటిగా మారుమనస్సు అను పదమునకు మరల తిరుగుట; మరియొక మార్గమున పోవుట; మారుట; చెడ్డవి, తప్పుడు పనులు మానుట అను నర్థమిచ్చును. యేసు మనము మాట్లాడు ఈ విషయముపై నొక యుపమానము చెప్పెను. "మీ కేమి తోచుచున్నది? ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటివాని యొద్దకు వచ్చి—కుమారుడా, నేడు పోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా వాడు పోను అని యుత్తరమిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. అతడు రెండవవాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా

వాడు అయ్యా, పోదుననెను గాని పోలేదు. ఈ యిద్దరిలో ఎవడు తండ్రి యిష్టప్రకారము చేసినవాడని వారి నడిగెను. అందుకు వారు—మొదటివాడే అనిరి. యేసు—సుంకరులను, వేశ్యలును మీకంటె ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించుదురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. యోహాను నీతిమార్గమున మీ యొద్దకు వచ్చెను, మీ రతనిని నమ్మలేదు; అయితే సుంకరులును, వేశ్యలును అతనిని నమ్మిరి; మీరు అది చూచియు నమ్మునట్లు పశ్చాత్తాప పడక పోతిరి" (మత్తయి 21:28-32). ఒకడు తన పాపములనుండి మరలునపుడు ప్రభువు మరణమునకు సాదృశ్యముగా యుండుటచే మారుమనస్సు, క్రీస్తు మరణము, సమాధి, పునరుత్థానములతో సంబంధము కలిగియున్నది. ఈ రెండు సంఘటనలలోను మారుమనస్సుయొక్క ప్రాముఖ్యతను మనము చూడగలము.

మానవుడు పాపి (రోమా 3:23). పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23) యని తెలిసినప్పుడు ఒకడు మారుమనస్సు పొందవలెను లేదా నశించవలెను యని క్రీస్తు బోధించెను (లూకా 13:3). దీనిని నొక్కి చెప్పుటకు క్రీస్తు మరల చెప్పెను (లూకా 13:5). అనగా ఒకడు తినను వశింపచేయు దానినుండి మరలితే తప్ప వాడు నశించునని యేసు చెప్పెను. ఆయన మరల ఇట్లు చెప్పెను, "అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిదిమంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషముకంటె మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:7). ఒకని పాపములను గూర్చి విచారపడుటకంటె మారుమనస్సు ఎక్కువ యని గ్రహించుకొనవలెను. ఒకడు దొరకిపోయి చెరసాల పాలయితినని విచారించవచ్చును. అతడు తాను చేసినదానికి విచారించుటలేదు గాని చెరసాలలో శిక్ష ననుభవించుటకు విచారించును. ఇది మారుమనస్సు కాదు. అపొస్తలుడైన పౌలు ఇట్లు చెప్పెను:

"దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును; ఈ మారుమనస్సు పశ్చాత్తాపము పుట్టించదు. అయితే లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును" (2 కొరింథీ 7:10). దైవచిత్తానుసారమైన దుఃఖము మారుమనస్సును కలుగజేయును. దానిని పశ్చాత్తాపముగా పొరబడరాదు.

## అందరు మారుమనస్సు పొందాలి

ఎవడు మారుమనస్సు పొందవలెను? పౌలు అరెయొపగు కొండపై బోధించినపుడు తన ప్రసంగము చివరలో ఈ విధముగా చెప్పెను: "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అ. కా. 17 : 30). దీనిప్రకారముగా ప్రభువు సమస్త జనులను మారుమనస్సు పొందుడి లేక మీ పాపములనుండి తిరుగుడి యని కోరుచున్నాడు. ఒకప్పుడు దేవుడు తెలియనితనమును కొన్ని విషయములలో క్షమించి యుండెడి వాడేమో గాని ఇప్పుడు పాపమును తెలిసి చేసినను, తెలియక చేసినను దానిని సహించి క్షమించడని తేట తెల్లముగా చేయబడెను. అపొస్తలుడైన పేతురు ఇట్లు చెప్పెను: "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2 పేతురు 3 : 9).

అందరు మారుమనస్సును పొందుటను గూర్చి చెప్పుటలో లేఖనములు వీరిని మనుష్యులుగాను, లేక పాపము చేసినవారుగాను గుర్తించుచున్నవి. ఇవి పసివారిని, చిన్నపిల్లలను మినహాయించుచున్నవి. ఎందుకనగా పరలోక రాజ్యము అట్టివారిదే (మత్తయి 18 : 1-3). తన తప్పులను గూర్చి మారుమనస్సు పొందుటకు జ్ఞానము గలవారికి అనగా తమ దుష్కార్యములను ఎరిగి వాటినుండి తిరుగ

వలెనని కోరువారికి సువార్త యుద్దేశించబడినది. ఇట్టి విచక్షణ జ్ఞానమును పొందు వయస్సును కలిగినవారే దీనిని చేయగలరు.

అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయములో చూచిన పేతురు, అపొస్తలులు పెంతెకోస్తు దినమున బోధించుచుండిరి. వారు పాపులకు బోధించుచుండిరి, అందులో కొందరు క్రీస్తును సిలువ వేయుటలో పాత్రికలవారు. మేమేమి చేతుమని వారు పేతురును, అపొస్తలులను అడిగి తెలిసికొనగోరి నపుడు పేతురు సహజమైన సమాధానము నిచ్చెను: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అ. కా. 2 : 38). మరియొకసారి పేతురు ఇట్లు చెప్పెను: "ప్రభువు సముఖము నుండి విశ్రాంతికాలములు వచ్చునట్లును, మీకొరకు నియమించిన క్రీస్తు యేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి" (అ.కా. 3:19).

లేఖనములలోని ఈ వాక్యములనుబట్టి మారుమనస్సు సువార్త యొక్క ఆజ్ఞలలో యొకటి యని తెలియుచున్నది. ప్రభువును అంగీకరించి తన పాపములు పరిహరింపబడవలెనని కోరిన యెడల ఒకడు తన పాపముల నుండి తిరిగి పోవలెను. మరియొక విధముగ చెప్పవలెననిన మారుమనస్సు పొందకుండ ఒకడు రక్షించబడి పరలోకమునకు పోలేడు. రక్షణపొందుటకు ప్రభువు ఏమి చేయవలెనని చెప్పెనో వాటిని తప్ప వాటిస్థానే మరేమియును లేదు.

అపొస్తలుల కార్యములను పఠించుచు, అందలి మత మార్పిడులను (Conversions) పరికించిన, అందు మారుమనస్సు ఆజ్ఞాపించక పోయిన యెడల అది అంతర్భాగమైనట్లు కానవగును. అ. కా. 16 లో పౌలు, సీలలు ప్రభువు వాక్యమును చెరసాల యధికారికి, అతని కుటుంబమునకును బోధించినపుడు అతడు వారిని తీసుకొనిపోయి వారి

గాయములను కడిగెను. అది మారుమనస్సు కాకపోయిన మరి ఏమి? అ. కా. 9వ అధ్యాయము ప్రకారము పౌలు క్రైస్తవులను బాధించు వాడుగా యుండెను, కాని వానికి ప్రభువు దర్శనము కలిగిన తరువాత అతడు మరియొక మనుష్యునిగా మారెను. అతడు సువార్తను అంగీకరించుటయే గాక, తను ప్రథమములో బహుగా వ్యతిరేకించిన క్రీస్తును ప్రకటించుట మొదలుపెట్టెను. ఇది మారుమనస్సు కాదా?

సువార్తకు విధేయుడగుటలో హృదయములో మార్పు కలుగును. ఇది విశ్వాసము వలన కలుగును; ఒక మారిన జీవితము, ఇందు మారుమనస్సు కనబడును; మారిన స్థితి, ఇది బాప్తిస్మము యొక్క ఫలితము యని ఒకడు చెప్పెను. మారుమనస్సు పొందుటలోను, క్రీస్తును అంగీకరించుటలోను ఒకని పాపములు పూర్తిగా క్షమించబడును లేక కడిగివేయబడును. ఒకడు నూతన సృష్టిగా మారుచున్నాడు (2 కొరింథీ 5:17). క్రీస్తునందు అతడు ఒక నూతన మానవుడు (గలతీ 3:26, 27). ఒకప్పుడు చేసిన కార్యములు ఇక చేయనే చేయడు. ఒకప్పుడు వ్యతిరేకించినవాటికి ఇప్పుడు సుముఖముగ యున్నాడు. ఇట్టిది ఈలోకమంతటిలోను వేరొకటి ఏమియును లేదు.

ఒకడు క్రైస్తవుడైన తరువాత మారుమనస్సు పొందవలసిన సమయములు ఉండవచ్చును. క్రైస్తవుడు పరిపూర్ణుడు కాడు. విశ్వాసియైన క్రైస్తవుడు కూడా పొరపాట్లు చేయవచ్చును. ఉద్దేశపూర్వకముగా పాపములు చేయువారు వారి తప్పిదముల నొప్పుకొని క్షమాపణకొరకు దేవుని ప్రార్థించవలెను (యాకోబు 5 : 16; అ. కా. 8 : 22). లేనియెడల వారు నశింతురు.

క్రైస్తవులుగా మారనివారు, క్రీస్తు సంఘములో ఇంకా సభ్యత్వము పొందనివారు క్రీస్తును వినవలసియున్నది. ఆయనయందు నమ్మికయుంచవలెను, వారి పాపముల నిమిత్తము మారుమనస్సు పొందవలెను, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను, పాపక్షమాపణ

నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. వీటిలో ప్రతి యాజ్ఞకూడా అతి ప్రాముఖ్యమైనది. ఒకడు వీటిలో ఒకటిచేసి మిగతా యాజ్ఞలు వదలి రక్షించబడలేడు. ఒక ఆజ్ఞను మాత్రమే వదలుటద్వారా కూడా ఎవడును రక్షించబడలేడు. ఒకడు తన ప్రతి పాపమును, అన్ని తప్పులను, మత సంబంధమైన తప్పులను తన జీవితములో నున్న ఇలుపంటి వన్నియును, తన విధేయత జీవితములో జీవించుటకుగాను వదలి వేయుటయే మారుమనస్సు అని యర్ధము. అప్పుడుమాత్రమే ఒకడు మారుమనస్సు యొక్క ఆజ్ఞను పాటించెనని చెప్పగలము.

— జె. సి. ఛోటే.

---

## నీ మార్గమును బలపర్చుము

### *( Strengthen your Way )*

( I రాజులు 18, 19 అధ్యా )

పాతనిబంధన ప్రవక్తలలో మోషే తరువాత ఏలియాను గూర్చి క్రొత్తనిబంధనలో పలుమార్లు చెప్పబడింది. బాప్తిస్మమిచ్చు యోహాను ఏలియావంటి ఆత్మగలవాడని చెప్పబడింది. రూపాంతర సమయంలో అతడు యేసుకు ప్రత్యక్షమయ్యాడు, అతని గూర్చి యేసు లూకా 4:25లోను, పౌలు రోమా 11:2 లోను, యాకోబు పత్రిక 5:17 లోను చెప్పడం జరిగింది. ఇశ్రాయేలు రాజగు అహాబు కాలంలో దేవుడు ఈ ప్రవక్తను నిలబెట్టాడు. అతని ప్రవచనమును బట్టి ఇశ్రాయేలులో 3½ సంవత్సరములు వర్షము కురియలేదు. ఈ క్షామకాలంలో ఇశ్రాయేలు దేశమంతా శ్రమపడినను ఈ ప్రవక్తను పోషించడానికి దేవుడు ఏర్పాట్లు చేసాడు. మొదట కాకోలముల ద్వారా దేవుడతని పోషించాడు. తరువాత సారెపతులో యున్న ఒక విధవరాలి దగ్గరకు ఆయన ఆతని పంపించాడు. మరల అతడు ప్రార్థన చేయగా ఇశ్రాయేలులో వర్షము కురిసింది. అతడు భయము లేకుండా రాజు నెదుర్కొన్నాడు. నాలుగువందల యాభై మంది బయలు దేవతా

ప్రవక్తల నతడు సవాలు చేసాడు, ఆ సవాలు నతడు జయించిన తరువాత 450 మంది బయలు దేవతా ప్రవక్తలందరిని కీషోను వాగు దగ్గర వధించాడు. ఏలియా చేసినదంతయు క్రూరురాలైన యెజెబెలుకు తెలియగా అతని చంపుదునని ఆమె అతనికి వర్తమానము పంపెను.

ఇక్కడ ఏలియా వింతప్రవర్తనను మనం గమనించగలము. అతడు నిర్భయంగా రాజు నెదుర్కొన్నాడు, ఏకాకిగా 450 మంది బయలు ప్రవక్తలను సవాలు చేసాడుగాని యెజెబెలున కతడుభయపడి ప్రాణభయము కలిగి బెయెర్షెబాకు చేరి తాను ఒకదిన ప్రయాణము అరణ్యములోనికి పోయి ఒక బదరీ వృక్షముక్రింద మరణాపేక్ష గల వాడై ఆ వృక్షముక్రింద పరుండి నిద్రించుచుండగా "ఒక దేవదూత వచ్చి అతని ముట్టి నీవులేచి భోజనము చేయుమని చెప్పెను...గనుక అతడు భోజనముచేసి తిరిగి పరుండెను. అయితే యెహోవా దూత రెండవ మారు వచ్చి అతని ముట్టి - నీ శక్తికి మించిన ప్రయాణము నీకు సిద్ధమైయున్నది, నీవు లేచి భోజనము చేయుమని చెప్పినపుడు అతడు లేచి భోజనము చేసి ఆ భోజనపు బలముచేత నలుబది రాత్రిం బగళ్లు ప్రయాణము చేసి దేవుని పర్వతమని పేరు పెట్టబడిన హోరేబు నకు వచ్చెను" (1 రాజులు 19 : 5-8).

## క్రైస్తవుని ప్రయాణం

ఒకడు దేవుని వాక్యమును నమ్మి, విధేయత చూపుచు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందినపుడు అతడు క్రైస్తవునివలె తన ప్రయాణము నారంభించును. యేసు, "నేనే మార్గమును సత్యమును జీవమును నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడని" చెప్పాడు (యోహాను 14 : 6). తండ్రి యొద్దకు వెళ్లాలంటే మనకొక దీర్ఘ ప్రయాణమున్నది. యిది మన శక్తికి మించినది. ఈ లోకంలో శిశువు జన్మించిన తరువాత ఆహారం లేకుండా ఎట్లు బ్రదుకలేడో అట్లే మన ప్రభువు యొక్క ఆత్మీయ రాజ్యములోనికి జన్మించిన

వాడెవడు ఆత్మీయాహారము లేకుండ బ్రదుకలేడు. అందువలన "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి" యని పేతురు చెప్పుచున్నాడు (1 పేతురు 2:2).

## క్రైస్తవుని ఆహారం

ప్రభువతని కనుగ్రహించిన ఆహారాన్ని ఏలియా భుజించి బలము పొంది దేవుని పర్వతమును చేరుటకు నలుబది రేయింబగళ్లు ప్రయాణం చేసాడు. క్రైస్తవులవలె మనం చేయు ప్రయాణంలో దేవుని పర్వతమునకు చేరుటకు మనకు కూడ శక్తి అవుసరం. ఏల యనగా మన ప్రయాణం శక్తికిమించినదే. గనుక నే ప్రభువు తాను మనకిచ్చే ఆహారాన్ని భుజించుడని చెప్పుచున్నాడు; అదే దేవుని వాక్యం.

క్రైస్తవ యాత్ర నారంభించిన తరువాత అనేకులు మార్గములో పడిపోతారు. ఎందుచేత? తమ యాత్ర నంతటినీ జరిగించుటకు వారిలో బలములేదు. ప్రభువు అనుగ్రహించు ఆహారాన్ని వారు భుజించరు గనుక వారికి బలము, లేక శక్తియుండదు. మన జీవితాల్లో సరిపడినంత బైబిలు పఠనం లేకపోవుటయే మన బలహీనతలకు మూల కారణం. మనం పాపములో పడకుండు నిమిత్తము ప్రభువు తన వాక్యముద్వారా మనల్ని నడిపిస్తాడు, బలపరుస్తాడు.

## దేవుని వాక్యం ఇచ్చే శక్తి

"మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు; నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువని" యేసుప్రభువు చెప్పాడు (మత్త 12:36, 37). ఈ వాక్యము మన హృదయములో నివసించినయెడల

నోటిద్వారా మనము పాపము చేయకుందుము. అది దుర్భాషలాడ కుండ, ఇతరులను నిందించకుండ, అబద్ధములాడకుండ మన నాలుకను అదుపులో యుంచును. మరల నీ శత్రువులను, నీ పొరుగువానిని ప్రేమించుమని దేవుని వాక్యం చెబుతున్నది. మనమట్లు చేసినపుడు యితరులకు ఏ హానియు చేయకుందుము. మనము పాపములో పడకుండ దేవుని వాక్యము సహాయం చేస్తాది. "నీ యెదుట నేను పాపము చేయ కుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను" అని అందుకే దావీదు చెప్పాడు (కీర్తన 119:11).

ఆపదలలో దేవుని వాక్యము మనకు ఆదరణ నిస్తాది. "గాఢాంధ కారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడై యుందువు నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును" (కీర్తన 23:4). "యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును" (సామె 18:10). "యెహోవా ఉత్తముడు, శ్రమదినమందు ఆయన ఆశ్రయ దుర్గము. తనయందు నమ్మిక యుంచువారిని ఆయన ఎరుగును" (నహూము 1:7). మన ఆపత్కాలములో ఆదరణ నిచ్చు యిట్టి వాక్య ముల నెన్నిటినో మనం కనుగొనగలము. దేవుని వాక్యము మనకు నిత్యజీవ నిరీక్షణ ననుగ్రహిస్తాది. ఆయన మార్గములో నమ్మకముగా యుండునట్లు సహాయపడ్తాది. దేవుని వాక్యం దేవునియొక్క ఘనతను, మహిమను, ఆయన శక్తిని మనకు తెలియజేస్తాది. భూమి సూర్య చంద్ర నక్షత్రాదులు కల్గిన విధానాన్ని తెలియజేస్తూ దేవుని బలిష్ట మైన చేతిక్రింద దీనమనస్కులగునట్లు అది మనకు సహాయం చేస్తాది.

బైబిలు చదవడానికి మనకు సమయం దొరుకుట లేదని సాకులు చెప్పేస్తాం. గాని యెహోవా ధర్మశాస్త్రమునందా నందించుచు దివా రాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు (కీర్తన 1). మనం విశ్వ సించి మారుమనస్సు పొంది బాప్తిస్మము పొంది, క్రైస్తవ యాత్ర

నారంభించినను, బలము లేనియెడల ఆ ప్రియాణంలో నిలువలేము. లిఖింపబడిన దేవుని వాక్యము (బైబిలు) మన ప్రియాణానికి కావలసినంత శక్తి నిచ్చును. గనుక ప్రతి దినము జీవాహారమును భుజించుచు, బలముపొంది దేవుని పర్వతమునొద్దకు మనం చేరుకొందుము గాక!

—కవిత గూటం, కాకినాడ.

---

## క్రైస్తవ సైనికుని యుద్ధోపకరణములు

( ఎఫెసీ 6 : 10-19 చదువుము )

[ గత సంచిక తరువాయి ]

యోబు : విశ్వాసము ద్వారా సాతాను కలుగజేసిన నష్ట కష్టములను శరీరబాధను లెక్కచేయక యెహోవా ఇచ్చెను యెహోవా తీసుకొనిపోయెను. యెహోవా నామమునకు స్తుతి కలుగుగాక అనెను పిల్లలందరు చనిపోయినను ఈ మాట పలికెను. ఈలాటి విశ్వాసము దేవునియందు మనకున్న సాతానుడు మన యొద్దనుండి పారిపోవును. 1 కొరి 11 : 23-33లో పౌలు తాను పొందిన శ్రమలను క్రీస్తు యేసు నందలి విశ్వాసము ద్వారా జయించెను. వీటన్నిటిలో అత్యధిక విజయము పొందెను. 1 యోహాను 5 : 4. లోకమును జయించిన (అనగా సాతానుని జయించిన విజయము మన విశ్వాసమే, సాతాను యొక్క అగ్ని బాణములు శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము; ఈ బాణములను ప్రయోగించినపుడు క్రైస్తవ సైనికుడు విశ్వాస మను డాలు నుపయోగించి సాతానును జయించగలడు. గాన ప్రతి క్రైస్తవ సైనికుడు ఈ విశ్వాస మను డాలుతో సాతానుతో పోరాడి జయించవలెను.

ఐదవది :- 6 : 17. మరియు రక్షణ అను శిరస్త్రాణమును Helmet of Salvation. సైనికునికి శిరస్త్రాణము తలలోని అవయవములకు దెబ్బలు తగులకుండా కాపాడును. క్రైస్తవ వీరుడు

సాతానుతో పోరాడు చున్నప్పుడు వాని మెదడు, కన్ను, చెవి, ముక్కు, నోరు మొదలగు తలలోని అవయవములు దెబ్బ తినకుండా చూచుకొనవలెనన్న అతడు రక్షణ అనే శిరస్త్రాణమును ధరించుకొనవలెను. రక్షణ అనునది క్రైస్తవ సైనికుని శిరస్త్రాణమై యున్నది. II తిమో 2 : 10. క్రీస్తునందు రక్షించబడినవాడు క్రైస్తవుడు. హెబ్రీ 7:24. క్రీస్తు తనకు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను. అపొ. కా. 2 : 47. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను. రోమా 8 : 3-4; 9; కొల 1 : 13-14. రక్షణ పొందినవాడు క్రైస్తవుడు. రక్షణ పొందినవారే క్రీస్తు సంఘములో చేర్చబడుదురు. క్రీస్తు సంఘ మనగా రక్షణ సైన్యము. క్రీస్తు సైనికుడు ఈ రక్షణ శిరస్త్రాణమును ధరించినపుడు సాతానుడు వాని చూచి పారిపోవును. పూర్వము పోలీసులు ఎఱ్ఱ టోపీని ధరించెడివారు. వారిని చూచి గ్రామస్తులు భయపడేవారు, కారణము గవర్నమెంటు అధికారము ఆ టోపీకి గలదు. రక్షింపబడిన సైనికుడు దేవుని శక్తి గలిగియుండును. గాన సాతాను వారిని సమీపించలేదు. క్రైస్తవ సైనికుడు వాని జయించును.

ఆరవది :- ఎఫె 6 : 17 దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి - **Take the sword of the spirit which is the word of God.** సైనికుడు ఖడ్గమును ధరించి దానితో పోరాడే వాడు. క్రైస్తవ సైనికుడైతే దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొని సైతానుతో పోరాడవలయును. కీర్తన 119 : 11. నీ యెదట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యముంచుకొని యున్నాను. క్రైస్తవుని హృదయములో దేవుని వాక్యము ఉండవలెను. యేసుక్రీస్తు దేవుని వాక్యము ద్వారా సాతానుని జయించెను. మత్తయి 4 : 4. మనుష్యుగు రొట్టెవలన మాత్రము కాదుగాని

దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట వలన జీవించును. శరీరమునకు శరీరాహారము ఎంత ముఖ్యమో మన ఆత్మకు దేవుని వాక్యాహారము అంత ముఖ్యము. దేవుని వాక్యము మనకు జీవాహారము. జీవజలము పాలు, తేనె, నీరు; ఆత్మపోషణకు వాక్యము అవసరము. అంతే కాకుండా మన పాదమునకు దీపము, త్రోవకు వెలుగు అగ్నివంటిది. సుత్తివంటిది, విత్తనమువంటిది, వెండి బంగారముల కంటె విలువైనది. హెబ్రీ 4:12. మన దేవుని వాక్యము, రెండంచుల ఖడ్గము. ఈ వాక్యము ద్వారా సాతానుని మనము జయించగలము. ప్రతి క్రైస్తవ సైనికుడు వాక్యముతో తన హృదయమును నింపుకొనవలెను.

క్రైస్తవ సైనికుడు ఇప్పుడు దేవుడిచ్చు. సర్వాంగ కవచమును ధరించుకొని యున్నాడు.

సత్యమను — దట్టి
నీతియను — మైమరువు
సువార్త — జోడు
విశ్వాసము — అనుడాలు
రక్షణ — శిరస్త్రాణము
దేవునివాక్యము — ఆత్మ ఖడ్గము

సత్యము, నీతి, సువార్త ప్రకటించు మనస్సు, విశ్వాసము రక్షణ, దేవుని వాక్యముతో నింపబడుట - ఈ క్రైస్తవ లక్షణములు ఇవి దేవుని ద్వారా ఇవ్వబడినవి. ఇట్టి క్రైస్తవ జీవితముగల క్రైస్తవ సైనికుడు క్రీస్తు రాజ్యము వ్యాపించుటకు, సైతాను రాజ్యమును కూల్చుటకు సిద్ధముగా ఉన్నాడు. ఇప్పుడతడు ప్రార్థన విజ్ఞాపన చేయుచు ప్రార్థన శక్తితో సాతానుతో పోరాడుచున్నాడు. సాతానుని జయించుటకు ప్రార్థన పోరాటము అవసరము.

ప్రార్థన ద్వారా మోషే గొప్ప కార్యములను దేవునికొరకు చేసెను. యెహోషువ యుద్ధములు జరిగించి జయించెను. సూర్యచంద్రులను ప్రార్థనద్వారా ఆపెను. ఏలియా ఎలీషాలు సాతాను యొక్క విగ్రహారాధనను ఎదిరించిరి. సమూయేలు ప్రజలకొరకు ప్రార్థించెను. యోబు సాతానును జయించెను. షద్రకు మేషెకు అబెద్నగోలను సాతాను అగ్నిలో వేయించగా వారు ప్రార్థన ద్వారా అగ్నిబలములను చల్లార్చి సాతానును జయించిరి. దానియేలు సింహము నోళ్లను మూయించి సాతానును జయించెను. పౌలు సీలల ప్రార్థించి సాతాను తంత్రములను ఓడించిరి. ఇంకను అనేక భక్తులు ప్రార్థనా జీవితము ద్వారా సాతాను తంత్రములను జయించి దేవుని రాజ్య వ్యాప్తికి పాల్పడిరి. క్రైస్తవ సైనికుడు పై చెప్పబడిన దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించి ప్రార్థనా పరుడైన యెడల సాతానును జయించును. క్రీస్తు సంఘము సాతానుతో యుద్ధము చేసి వాని రాజ్యమును కూల్చి, క్రీస్తు రాజ్యము ఈ లోకములో స్థాపించవలెనన్న ప్రతి క్రైస్తవ యోధుడు పై చెప్పబడిన దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించి మన సైన్యాధిపతియైన క్రీస్తుతో కలసి యుద్ధమాడు వాడైన యెడల క్రీస్తు రాజ్యము ఈ లోకమంతా వ్యాపించబడును. (సమాప్తం)

— పి. ప్రకాశము, హైదరాబాదు.

---

## ద్రాక్షావల్లి మరియు తీగెలు

[ గత సంచిక తరువాయి ]

క్రైస్తవుడు పడిపోయి చివరకు నిత్యనాశనము కాగలడని లేఖనములు బోధించుచున్నవి. వీటిలో కొన్నిటిని గమనించుము. క్రీస్తులోనుండి బొత్తిగా వేరైపోయి కృపలోనుండి తొలగిపోయిన వారిని గూర్చి పౌలు ఈలాగు చెప్పాడు: "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులోనుండి వేరు

చేయబడియున్నారు, కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5 : 4). తనను గూర్చి చెప్పుకొనుచు, "ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి దానిని లోపరచుకొనుచున్నాను" అని పౌలు చెప్పాడు (1 కొరింథీ 9:27). అంతేకాదు, పౌలు మిగిలిన క్రైస్తవులను కూడ వారు పడిపోకుండునట్లు హెచ్చరించాడు : "తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" (1 కొరింథీ 10 : 12). ఒకడు పడిపోయే ప్రమాదము లేకపోతే ఈ హెచ్చరిక ఎందుకు ?

క్రైస్తవులు దూతల కంటే భద్రముగా యున్నారా ? దేవదూతలు పాపము చేసారని పేతురు చెప్పాడు : "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక, పాతాళలోక మందలి కటిక చీకటి గల బిలములలోనికి త్రోసి తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2 పేతు 2 : 4). లవొదికయ సంఘములో నులి వెచ్చగానున్న క్రైస్తవునికి, "నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక నులివెచ్చగా ఉన్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నాను" అని ప్రభువు చెప్పాడు (ప్రకటన 3:16). మరల, "జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవ గ్రంథములోనుండి అతని పేరెంత మాత్రమును తుడుపు పెట్టక ... అతని పేరు ఒప్పుకొందునని" ప్రభువు చెప్పుచున్నాడు (ప్రక 3 : 5). ఒకని పేరు జీవగ్రంథములో ఎన్నడు లేకపోతే అది తుడువు పెట్టబడదు. ఒకడు గత పాపములనుండి రక్షింపబడకపోతే అతని పేరు జీవగ్రంథములో ప్రవేశించదు. రక్షింపబడని వాని పేరు ఆ గ్రంథములో ఎన్నడు ఉండదు. అయితే జయించని వారిపేర్లు ఆ గ్రంథమునుండి తుడువు పెట్టబడునని ప్రభువు చెప్పుచున్నాడు. అట్టివారు తీర్పులో నిత్యనాశన మొందుదురు. "ఎవని పేరైనను జీవ

గ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను" (ప్రక 20 : 15). "యెవడు నా యెదుట పాపము చేసెనో వాని నా గ్రంథములో నుండి తుడిచి వేయుదునని" యెహోవా దేవుడు మోషేతో అన్నాడు (నిర్గమ 32 : 33).

విశ్వాసి యైనవాడు విశ్వాస భ్రష్టుడు కాగలడని (1 తిమో 4 : 1), విశ్వాస విషయమై ఓడ బద్దలైనవానివలె కాగలడని (1 తిమో 1 : 19), విశ్వాసము చెరుపుకోగలడని లేఖనములు బోధించుచున్నవి (2 తిమో 2 : 18). అందువలననే "మరణ పర్యంతము నమ్మకముగా యుండుము; నేను నీకు జీవకిరీట మిచ్చెదనని" బైబిలు చెప్పుచున్నది (ప్రకటన 2 : 10).

**vi. క్రీస్తులో నిలచి యుండాలంటే విధేయత అవసరం**

ఆత్మీయ ద్రాక్షవల్లి యగు క్రీస్తులో విధేయత చూపిస్తూ యుంటేనే గాని ఎవడును నిలిచి యుండలేడు. "నా యందు మీరును, మీ యందు నా మాటలును నిలిచి యుండిన యెడల మీ కేది యిష్టమో అడుగుడి; అది మీకు అనుగ్రహింప బడునని" యేసు చెప్పాడు (యోహాను 15 : 7). గనుక క్రీస్తు యొక్క మాటలకు లోబడుట ద్వారా ఒకడు, క్రీస్తులో నిలచియుండును. నమ్మకమైన విధేయతవలన ఒకడు క్రీస్తులో నిలిచియుండును. "నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలను గైకొనిన యెడల నా ప్రేమయందు నిలిచియుందురు" అని యేసు చెప్పాడు (యోహాను 15:10). "... కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప నియ్యుడి" యని పౌలు క్రైస్తవులను హెచ్చరించాడు (కొలస్స 3:16).

ఒకడు క్రీస్తులో నిలిచియుంటేనే అతని ప్రార్థన లంగీకరించ బడును. ఎవనిలో దేవుని వాక్యము నివసిస్తూ యుంటాడో అతని

ప్రార్థనలకు జవాబు దొరుకును (యాకో 5:16). "మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" (1 యోహా 3:22). గాని "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించుకొను వాని ప్రార్థన హేయము" (సామె 28:9). "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడుచేయు వారికి విరోధముగా ఉన్నది" (1 పేతు 3:12).

**vii. ఫలదాయక జీవితమువలన దేవుడు మహిమ పరచబడును**

క్రైస్తవులు ఫలములను ఫలించుటవలన దేవుని మహిమ పర్చుదురు. "మీరు బహుగా ఫలించుటవలన నా తండ్రి మహిమ పరచబడునని" యేసు అన్నాడు (యోహా 15 : 8). తన బిడ్డలు ఆత్మీయ ఫలములను ఫలించుటవలన దేవునికి ఘనత కలుగును. అయితే ఎట్టిఫలములు ఫలించాలి ? అపొ. పౌలు ఇట్లు చెప్పాడు : "ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచి తనము, విశ్వాసము, సాత్వికము, ఆశా నిగ్రహము; ఇట్టివాటికి విరోధమైన నియమము ఏదియులేదు" (గలతీ 5:22, 23). క్రైస్తవులు నమ్మకముగాను, ఆసక్తి పరులుగాను, వినయులుగాను, ప్రతిష్ఠించుకొనిన వారుగాను, విధేయత చూపుచు ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులైయుండాలి (1 కొరింథి15:58).

## సంగ్రహము

యోహాను 15:1-8లో చెప్పబడిన సుందర దృశ్యము క్రీస్తుకును ఆయన శిష్యులకును ఉన్న అత్యంత సన్నిహిత సంబంధమును చూపుచున్నది. దానిలో ఏడు పాఠములు గమనించుము:

1. దేవుడు ద్రాక్షావల్లి యజమాని
2. ద్రాక్షావల్లికి దాని తీగెలకు ఉన్న సంబంధము యెట్టిదో, క్రీస్తుకు ఆయన శిష్యులకు ఉన్న సంబంధము అట్టిది.

3. ఆయా డినామినేషన్లు సంఘము యొక్క శాఖలుకావు.
4. ఎవడైనను ఫలములు ఫలించాలంటే క్రీస్తుతో ప్రాముఖ్యమైన సంబంధమును కలిగియుండాలి.
5. జీవముకొరకు ఫలముకొరకు శిష్యుడు క్రీస్తులోనే యుండాలి.
6. విధేయత చూపుచు యుంటేనేగాని ఎవడును క్రీస్తులో నిలచియుండలేడు, మరియు

7. ఫలములు ఫలించుట ద్వారా క్రైస్తవులు దేవుని మహిమపరతురు. నమ్మకమైన క్రైస్తవునిగా యుండుటకంటే శ్రేష్టమైన, ఆనందదాయకమైన, సంపూర్ణమైన జీవితం మరొకటిలేదు. (సమాప్తం)

— పెర్రి బి. కోతమ్.

---

సంక్షిప్త ప్రసంగము :

## క్రీస్తు నందలి విశ్వాసము
### ( *Faith in Christ* )

పరిచయము :

1. రక్షింపబడాలంటే ఒకడు దేవునియందు, యేసు ప్రభునియందు విశ్వాస ముంచాలని బైబిలు బోధించుచున్నది (హెబ్రీ 11:6; యోహా 3 : 16).

2. క్రీస్తు నందలి విశ్వాసము యొక్క భావాన్ని గ్రహించుదాం.

విశ్వాసమనగా :

యేసు దేవుని కుమారుడని, పాపుల రక్షకుడని అంగీకరించుట. యిది ప్రాథమిక భావము.

క్రీస్తును మనం చూడలేదుగాని ఆయన దేవుని కుమారుడని, మానవుల రక్షకుడని అంగీకరిస్తాము.

ఆయనను గూర్చి మనకీయబడిన దృఢమైన ఋజువులను బట్టి ఆయన నంగీకరిస్తాము (హెబ్రీ 11 : 1; 1 కొరి 15 : 1-4).

దేవుని వాక్యము వినుటవలన విశ్వాసము కలుగును (రోమా 10 : 17). అయితే విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలదు : కొందరు విశ్వసించారుగాని రక్షింపబడలేదు (యోహా 12 : 42, 43). దయ్యములు నమ్మి వణకుచున్నవి (యాకో 2 : 19). ఒకడు సువార్త సత్యములను నమ్మువరకు క్రీస్తునొద్దకు రాలేడు.

విశ్వాసమనగా క్రీస్తుకు లోబడుట :

నేను చెప్పినట్లు చేయక, ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు ? అని యేసు ప్రశ్నించాడు (లూకా 6:46).

తండ్రి చిత్తమునకు లోబడువారే రక్షింపబడుదురు (మత్త 7:21).

సత్యమునకు విధేయులగుట ద్వారా ఆత్మలు రక్షించబడును (1 పేతు 1 : 22).

క్రియ మూలమునను నీతిమంతులమని తీర్చబడుదుము (యాకో 2 : 24).

యిది దేవుని కృపను వ్యతిరేకించదు (ఎఫె 2:8, 9).

విశ్వాస మను మాటలో, విధేయతతో కూడిన విశ్వాసమను భావము ఇమిడి యున్నది.

మార్పు జెందిన వారి సందర్భాలలో యిది విదితము.

ముగింపు :

1. నీవు క్రీస్తునందు విశ్వాసివా ?
2. రక్షించు విశ్వాసము నీకున్నదా ?
3. నమ్మినను రక్షింపబడలేని వారిని గూర్చి జ్ఞాపకముంచుకొనుము.
4. రక్షింపబడాలంటే ప్రభువు చెప్పునదంతయు చేయువరకు ఒకడు విశ్వసించాలి.
5. విశ్వసించుము, మారుమనస్సు బొందుము, క్రీస్తును ఒప్పుకొనుము, బాప్తిస్మము పొందుము - రక్షింపబడుము.

# క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి

(రోమా 16 : 16)

క్రీస్తు సంబంధులు క్రైస్తవులు, పరిశుద్ధులు వారు కలిగియున్నది క్రీస్తు సంఘం మాత్రం.

క్రీస్తు సంబంధులు, విశ్వాసములోను, ఆచరణలోను క్రీస్తు బోధను మాత్రము అనుసరింతురు క్రీస్తు బోధలో లేని ఏ పేరు, ఉపదేశము, సిద్ధాంతము సంఘ చట్టముగా అంగీకరించరు.

క్రీస్తు సంబంధులు క్రీస్తు వాక్యమునకు లోబడి ఉంటారు. క్రీస్తు సంబంధులు మాటచేత గాని క్రియచేత గాని ఏమి చేసినను ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచుందురు.

క్రీస్తుసంఘము ప్రభువుకు స్తోత్రం చెప్పుటయందు మిక్కిలి ఆశక్తి కలిగి ఉండును. "ప్రభువుకు స్తోత్రము" "దేవునికి స్తోత్రము" అను కృతజ్ఞత వచనము ఎప్పుడు చెప్పుకొను చుండుట క్రీస్తు సంఘమునకున్న ఆత్మీయ సంతృప్తి, ఆత్మీయ ఆనందము.

క్రీస్తు సంబంధులు ఒకరికి ఒకరు ఏమి చెప్పుకొనవలెనని పరిశుద్ధాత్ముడు సెల విచ్చెను ? ప్రతి పరిశుద్ధునికి క్రీస్తు యేసునందు "వందనము" చెప్పుడి. ఫిలి 4 : 21-22.

అపొ. పౌలు సంఘములకు "వందనములు" చెప్పెను

(1 కొరి 16:21, 2 కొరి 13:13, కొల 4:18, 2 థెస్స 3:17) క్రీస్తు సంఘము ఒకరికి ఒకరు "వందనములు" చెప్పవలెను మనము పరిశుద్ధాత్మవలన తెలుపబడిన కొ॥ని॥ వాక్యము నమ్ముదము (2 తిమొ 4 : 19-21, తీతు 3 : 15, ఫిలి 1 : 23-24, హెబ్రీ 13 : 24, 2 యోహా 1:13).

ఇందు మూలముగా ఆత్మానుసారముగా నడుచుటకు పిలువబడిన క్రీస్తు సంఘము లన్నియు ఒకరికి ఒకరు "వందనములు" చెప్పుకొనుటద్వారా దేవుని చిత్తమును జరిగించుదము. ఒకరికొకరము ఎదురుపడినపుడు ఆత్మానుసారమైన "వందన వచనములు" పలుకక ప్రభువుకు స్తోత్రం **Praise the Lord** అని పలుకుట వాక్యమును తిరస్కరించి సోదరుని వంచించి, ఆత్మను దుఃఖపరచుట యగును.

నీవు చూచుచున్న నీ సహోదరునికి ఆత్మానుసారమైన వందన వచనముద్వారా ప్రేమను వెల్లడి చేయక, దేవుని ప్రేమించుచున్నానన్న నిరూపణ కొరకైన "ప్రభువుకు స్తోత్రము"ను వచనమును పలుకుచూ దేవునిని ప్రేమించుచున్నావు!

అట్లు చేయుట అబద్ధమును జరిగించుట యని పరిశుద్ధాత్మ బయలుపరచెను. 1 యోహా 4:20. మనము సహోదరులకు మాత్రమే కాక ఇతరులకు కూడ వందనము చెప్పుట దేవుని చిత్తము. మత్త 5:47.

క్రీస్తు వాక్యమును నమ్మి క్రీస్తు అడుగుజాడలందు నడుచుకొనుచున్న క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి.

— పాల్ గూటం, గొల్లపల్లి.

## సజీవ ప్రతికలు
### *( Living Letters )*

ప్రతిదేశము యితర దేశాలకు తన రాయబారులను పంపుతాది. యితడొక విదేశములో జీవిస్తూ తన స్వదేశము యొక్క అధికార ప్రతినిధిగా యుంటాడు. ఈ రాయబారులను గమనిస్తూ వారి దేశములను గూర్చిన భావాలను మనం ఏర్పరచుకొంటాము. "మేము క్రీస్తుకు రాయబారులమని" పౌలు 2 కొరింధి 5 : 20లో చెప్పాడు. ఒక దేశపు రాయబారి తన దేశానికి అవఘనత వచ్చునట్లు ప్రవర్తిస్తే అది ఎంత ఘోరము !

అదే విధముగా, నీవు క్రైస్తవుడవైతే నీ వెక్కడికి వెళ్లినను, ఏమి చేసినను క్రీస్తుకు రాయబారిగా యుంటావు. అందువలన మనము సత్ క్రైస్తవ ప్రవర్తన కలిగియుండాలి. క్రీస్తు సంఘానికి ఆయన నామానికి అవఘనత తెచ్చేలాగున మనము ప్రవర్తించుట ఘోరము!

కొరింథులోని క్రైస్తవులు 'తన పత్రిక' యని అపొ. పౌలు చెప్పాడు. "మా హృదయముల మీద వ్రాయబడి, మనుష్యు లందరు తెలిసికొనుచు చదువుకొనుచున్న మా పత్రిక మీరే కారా? రాతి పలక మీదగాని, సిరాతోగాని వ్రాయబడక మెత్తని హృదయములు అను పలకమీద జీవము గల దేవుని ఆత్మతో మా పరిచర్య మూలముగా వ్రాయబడిన క్రీస్తు పత్రికయైయున్నారని మీరు తేట పరచబడుచున్నారని" అతడు వారికి తెలియ జెప్పాడు (2 కొరి 3:2, 3). యితరులు వారిని గమనించి నప్పుడు పౌలు వారికి చేసిన ఉపదేశమును తెలిసికొందురు. మనము కూడ క్రీస్తు పత్రికయై యున్నాము. యిది సత్యమైతే, నీ చుట్టూయున్న ప్రజలకు ఏరకమైన వర్తమానమును ప్రచురించుచున్నావు? 1 పేతురు 3:1,2లో పేతురు ఇట్లనుచున్నాడు: "అటువలె స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి; అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తన చూచి వాక్యము లేకుండనే తమ భార్యల నడవడివలన రాబట్ట బడవచ్చును".

మాటల ద్వారానే గాక ప్రవర్తనద్వారా కూడ మనం ఉపదేశించు చున్నామని గమనించాలి. మన క్రియలు మాటలకంటే అనేకసార్లు చాల శక్తివంతమైనవి. నీ మాటలకంటె నీక్రియల శబ్దము ఎక్కువగా యుంటాది. ప్రజలు మన పెదవులనుండి వచ్చు మాటలను బట్టిగాక మన జీవిత విధానమునుబట్టి మనము పొందిన ఉపదేశాన్ని గమనిస్తారు.

నీవొకటి చెప్పి యింకొకటి చేసేవాడవా? నీ జీవిత విధానాన్ని బట్టి యితరులు క్రీస్తు సంఘాన్ని హేళన చేయుచున్నారా? అట్లయితే దేవుడు నిన్ను గూర్చి, నీ జీవితాన్ని గూర్చి ఏమనుకొనుచున్నాడు? నీ జీవితాన్ని మార్చుకొనే అవసరత నీకున్నదా? క్రీస్తు అధికారాన్ని నీ జీవితంలో ఎల్లప్పుడు ఒప్పుకొనుచు ఆయనకు మంచి రాయబారిగా జీవించుము.

— రాణీ లోకే

---

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..........................................
..........................................
..........................................
..........................................